బావిలో జారిపడి యువకుడి మృతి


మృతి చెందిన వెంకటేష్

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారి పల్లి పంచాయతీ గురవయ్యగారిపల్లికి చెందిన వెంకటేష్ (28) అనే యువకుడు పల్లెకు సమీపంలోని పొలం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ రవీంద్రబాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పెనగలూరు : మండలంలోని కొండూరు పంచాయతీ తిరుణంపల్లి గ్రామానికి చెందిన బుజ్జయ్య అనే వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం బుజ్జయ్య ఇంటిలో సోదా చేయగా 59 మద్యం బాటిళ్లు గుర్తించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పెన్నాలో మృతదేహం లభ్యం


రమణయ్య(ఫైల్)

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలో నివాసం ఉన్న దేవర రమణయ్య(63) అనే వ్యక్తి ఈనెల 11వ తేదీ సాయంత్రం జంగాలపల్లె గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదిలో మృతి చెందినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మంగళవారం ఎస్ఐ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ రాత్రి నుంచి రమణయ్య కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 11వ తేదీ అతని మృతదేహం పెన్నా నదిలో లభ్యమైంది. మృతుడి భార్య సుభద్రమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరందరికి వివాహాలయ్యాయి. మొదటి భార్య 2008లో చనిపోవడంతో 2009లో నెల్లూరు జిల్లా కలువాయి మండలం మంగళం గ్రామానికి చెందిన లక్ష్మీదేవిని రమణయ్య రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె అప్పటికే భర్తను వదిలేసి ఉంది. వీరిద్దరూ ఏడాది నుంచి సిద్దవటంలో నివాసం ఉంటున్నారు. మృత దేహాన్ని శవ పరీక్ష కోసం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సుబ్రమణ్యేశ్వరుడికి వెండి కవచం బహూకరణ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో వెలసి వున్న సుబ్రమణ్యం స్వామి మూలవిరాట్‌కు మంగళవారం స్థానిక బంగారు వ్యాపారి తోట యుగంధర్ కుటుంబం రూ.5 లక్షలు విలువ చేసే వెండి కవచాన్ని బహూకరించారు. అలాగే అర్చకులు యోగీశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేసి స్వాములవారికి అలంకరించారు.

కార్తిక పౌర్ణమి వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కరపత్రాలు ఆవిష్కరించిన అధికారులు
- ఉదయం స్వామి వారి కల్యాణం, సాయంత్రం గిరిప్రదక్షణ
- భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపు


కార్తిక పౌర్ణమి వేడుకల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు, కమిటీ ప్రతినిధులు

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో ఈ నెల 15న కార్తీక పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్, జిల్లా టూరిజం శాఖ అధికారి ఎం.నాగభూషణం, కార్యనిర్వహణ అధికారి జి.కొండారెడ్డిలు వెల్లడించారు. మండల పరిధిలోని అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కార్తిక పౌర్ణమి వేడుకల కరపత్రాలను అధికారులు, గిరి ప్రదక్షిణ కమిటీ నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఉదయం 4.30 గంటలకు రుద్రాభిషేకం, 6గంటలకు కుంకుమార్చన, 7గంటలకు గోమాత వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అదే విధంగా ఉదయం 9గంటల నుంచి 10.30గంటల మధ్య కనుల పండువగా వైభవంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఉదయం 10.30 నుంచి ప్రత్యేక కార్తిక రుద్రాభిషేకం, మధ్యాహ్నం 1గంటలకు కార్తిక వన భోజనాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మధ్యాహ్నం 3 నుంచి మహిళలచే కోలాటం, పండరి భజనలు, 6గంటల శిఖర దీప దర్శనం, 6:10 దీపోత్సవం, 7:10కి బహుదానదికి గంగాహారతి, 7:30 నుంచి రథోత్సవం, గిరిప్రదక్షణ, రాత్రి 8.30 నుంచి 9.30 వరకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కరపత్రాలు ఆవిష్కరించిన వారిలో ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభశాస్త్రీ, గిరి ప్రదక్షణ అధ్యక్ష, కార్యదర్శులు సిద్దలింగారెడ్డి, పోకల ప్రభాకర్, కోశాధికారి వై.నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అపార్‌కు ఆధార్ లింకుతో సమస్యలు

రాయచోటి అర్బన్ : అపార్ ఐడీ నమోదు కోసం జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆధార్‌లో సవరణల కోసం విద్యార్థులు, వారి తల్లితండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా ఉచితంగా ఆధార్‌లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పలుచోట్ల ఆధార్ కేంద్రాల నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడి ఆధార్‌లో సవరణల కోసం రూ.3 నుంచి 5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తల్లితండ్రుల ద్వారా తెలుస్తోందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలానే నోటరీ తదితర డాక్యుమెంట్లు లేకుండానే జనన ధృవీకరణ పత్రాలను అందజేయాలంటూ కోరారు. అపార్ ఐడీ నమోదుకు ఆధార్‌కార్డు లింకు చేయడం వలన సమస్యలు ఎదువుతున్నాయన్నారు. పాఠశాల రికార్డుల ప్రకారం యుడైస్ వివరాలు నమోదు ప్రకారం అవకాశం కల్పించి ఉంటే విద్యార్థులకు ఇబ్బందులు తప్పేవంటూ తెలిపారు. ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలంటూ డిమాండ్ చేశారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

సిద్దవటం : మండల పరిధిలో ఉన్న ముమ్మడిగుంటపల్లె గ్రామ సమీపంలోని సర్వేనెంబర్ 175లో ఉన్న కొండ ప్రాంతం నుంచి మంగళవారం తెల్లవారుజామున కొంతమంది అక్రమార్కులు జేసీబీ యంత్రాన్ని ఉపయోగించుకొని ట్రాక్టర్‌లో గ్రావెల్‌ను తరలిస్తున్నారని గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇచ్చినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో పలువురు పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై సంబంధిత వీఆర్‌ఓను వివరణ కోరగా గ్రావెల్ తరలింపునకు ఎవరికి ఎలాంటి అనుమతులు లేవని ఈ విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం రాఘవరాజపురం పంచాయితీలోని గంగరాజుపరం పెట్రోల్ బంక్ వద్ద వంకకు పక్కనున్న ఎల్‌పీఎం 178, ఓల్డ్ సర్వేనెంబర్ 38-1లో ఉన్న భూమిని అదే గ్రామానికి చెందిన వారు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం తహసీల్దార్ మహబూబ్ చాంద్, సీఐ హేమసుందర్‌రావు, ఎస్ఐ నవీన్‌బాబులు సంఘటనా స్థలానికి చేరుకొని కట్టిన కట్టడాన్ని కూలదోయించారు.

పశు వైద్యశాలలో తక్షణం మందులు సమకూర్చాలి

చిట్వేలి : స్థానిక పశువుల ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచాలని రైల్వేకోడూరు నియోజకవర్గం సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, ఉపాధ్యక్షులు తిప్పన ప్రసాద్‌లు పశువుల ఆసుపత్రిని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఆసుపత్రిలో మందులు లేకపోవడం అన్యాయమన్నారు. దీంతో గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు రోగాలతో చనిపోయి రైతులు నష్టపోతురన్నారు. ఇన్నాళ్లు ఆసుపత్రికి మందులు సమకూర్చలేకపోవడంలో సిబ్బంది నిర్వాకాన్ని వారు ప్రశ్నించారు. అటవీప్రాంతం కావడంతో ప్రతి పంచాయతీలో రైతులకు పశువులు, మేకలు, గొర్రెలు ఉన్నాయని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు తక్షణం మందులు సమకూర్చాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే ఆసుపత్రిని ముట్టడించడంతోపాటు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

చోరీ కేసులో నిందితుడికి జైలుశిక్ష

రాయచోటి టౌన్ : స్కూటర్ దొంగలించిన కేసులో చౌడం రాజు అలియాస్ రాజు అనే నిందితుడు స్కూటర్ దొంగలించిన కేసులో మంగళవారం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అడిషనల్ జడ్జి జీసీ ఆసీఫా సుల్తానా మూడు నెలల జైలు శిక్ష విధించారు. వివరాలు.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం గుండ్లచెరువుకు చెందిన జి.రెడ్డిప్రసాద్ (సీఆర్‌పీఎఫ్ పోలీస్) ఏపీ39 డీజే 1810 నంబర్ గల స్కూటర్ ఈ ఏడాది జులై 4వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో పార్క్ చేశాడు. తరువాత వచ్చి చూడగా స్కూటర్ ఎవరో దొంగలించారని అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడి పట్టుకుని స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి 3 నెలల జైలు శిక్ష వేస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ప్రసాద్ యాదవ్

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ కార్యదర్శిగా ఎన్నికైన కావేటి ఫణీంద్ర ప్రసాద్ యాదవ్‌ను మంగళవారం మండల యూటీఎఫ్ అధ్యక్షులు మనోహర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే బనయపల్లి ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ పురస్కరించుకొని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగా తిరుమలరావు, లక్ష్మీకుమార్, రామమూర్తి, నరసింహ, వెంకటేశ్వర్లు, ప్రసన్న, సిద్దారెడ్డి, శ్రీను, కన్నయ్య, సుదర్శన్ రెడ్డి, పురుషోత్తం, రామాంజులు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కూలీ తక్కువ అందుతోందని ఫిర్యాదు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీలోని ఉపాధి కూలీలు మంగళవారం ఎంపీడీఓ విజయారావుకు ఉపాధి కూలీ గురించి ఫిర్యాదు చేశారు. ఉపాధి సిబ్బంది తమకు తక్కువ కూలీ వేస్తున్నారని, ఇప్పుడూ తక్కువ కూలీ వస్తుందని ఎంపీడీఓ తెలియజేశారు. ఇలా తక్కువ కూలీ వేస్తే మేము ఎలా బతకాలని ఆయనకు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎంపీడీఓ మీరు చేసిన పనులను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని కూలీలకు ఆయన హామీ ఇచ్చారు.

సమావేశాన్ని దిగ్విజయం చేయండి

నందలూరు : డిసెంబర్ 12వ తేదీన ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజంపేటలో జరిగే పార్లమెంట్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విభిన్న ప్రతిభావంతుల సంఘం పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ మంగళవారం పిలుపునిచ్చారు. మండల నూతన అధ్యక్షునిగా ఆలుసూరి శివకోటిని ఎన్నకున్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బనరసారెడ్డి, ఖాదర్ బాషా, వెంకట ప్రసాద్, వెంకట సుబ్బయ్య, మౌలాలి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


లక్కిరెడ్డిపల్లి : గ్రామ సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం కుర్నూతల పంచాయతీలోని అగ్రహారం సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూములు పెండింగ్‌లో ఉన్న జాయింట్ నెంబర్లు రెవెన్యూ సిబ్బంది ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. రీ సర్వేలో తప్పులు జరిగిన వాటిని ఆయా గ్రామ సర్వే వీఆర్‌ఓతో కలిసి వాటిని సరిచేసుకోవాలని సూచించారు.

ఎన్‌సీడీ సర్వేకు సహకరించాలి


హిమశ్వేత, వైద్యాధికారిణి

ఒంటిమిట్ట : నాన్ కమ్యూనికబుల్ డిసీజర్ (ఎన్‌సీడీ) సర్వే కార్యక్రమాన్ని ఒంటిమిట్ట మండలంలో ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ఒంటిమిట్ట ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారిణి హిమశ్వేత మంగళవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌సిడి కార్యక్రమం ద్వారా మండలంలోని గ్రామాలలో ఇంటింటికి తిరిగి సర్వే చేస్తామన్నారు. 18 సంవత్సరాలు నిండిన స్త్రీ, పురుషులకు స్కానింగ్ చేయనున్నట్లు తెలిపారు. సర్వే ముఖ్య ఉద్దేశం క్యాన్సర్ బారిన పడిన వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి అని పేర్కొన్నారు. క్యాన్సర్ ఏ దశలో ఉందో తెలుసుకొని అనుభవం కల్గిన డాక్టర్లకు సిఫారసు చేస్తామని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సర్వేలో నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, బీపీ, షుగర్, హెచ్ఐవీ తదితర పరీక్షలు జరనున్నట్లు వివరించారు.

వ్యక్తి అదృశ్యం ; కేసు నమోదు


గుబ్బల నరేష్(ఫైల్)

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన గుబ్బల నరేష్(35) అనే వ్యక్తి కనిపించడం లేదంటూ ఆయన భార్య మంజుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించడం లేదని బంధువుల ఇళ్లు, తెలిసిన వారికి సమాచారం అందించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు మంజుల తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

గాలివీడు : క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని గాలివీడు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రవిచంద్ర, గౌతమ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను కలిపి గౌతమ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రాంగణంలో 2024-25కు సంబంధించిన క్రీడా పోటీలను పాఠశాల యాజమాన్యం సైజూ థామస్, శింటో ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లిజా జాయ్, లిక్సన్ పాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన


ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సిద్దవటం : మండలంలోని వెలుగుపల్లె గ్రామంలో కొళాయిలకు తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం తాగునీటి కొళాయి వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. పెన్నా నదిలోని పైప్‌లైన్ ద్వారా కొంతవరకు మాత్రమే బిందె, లేద రెండు బిందెలు నీరు వచ్చేవన్నారు. 10 రోజులుగా తాగునీరు రాకపోవడంతో కొందరు డబ్బులు పెట్టి నీటిని కొంటున్నామని తెలియజేశారు. మరికొందరు మాత్రం గ్రామంలోని చేతి పంపు ద్వారా వచ్చే నీరు తాగుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నంబేపల్లె/సుండుపల్లె : ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రంథాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయం వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పద్య, క్విజ్ పోటీలు నిర్వహించి 20న విజేతలకు బహుమతులను అందిస్తామన్నారు.

అందరికీ చదువు నేర్పించడానికే 'ఉల్లాస్'

సిద్దవటం : అందరికీ చదువు నేర్పించాలన్నదే ఉల్లాస్ లక్ష్యమని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో మంగళవారం కడప వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో డ్వాక్రా యానిమేటర్‌లు, డ్వాక్రా మహిళలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వాటి బారీ నుంచి చదువు రాని వారికి చదువు నేర్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. డ్వాక్రా ఏపీఎం సుజాత మాట్లాడుతూ గతంలో చదువు కొందరికే పరిమితమైయ్యేదని సమానత్వం కోసం ఆడవారికి చదువు అవసరమన్నారు. 200 రోజులపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో 10మంది చదువురాని వయోవృద్ధులకు ఒక వాలంటీర్ చదువు చెప్పాలన్నారు. సిద్దవటం మండలంలో 746 మంది వయో వృద్ధులకు చదువు నేర్పించాల్సి ఉంటుందన్నారు. ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీఓ శోభారాణి, ఎంఈఓ-2 అరుణలు మాట్లాడుతూ గతంలో చదువురాని వారికోసం ప్రభుత్వం రాత్రివేళల్లో వయోజన విద్య, సాక్షర భారత్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. వయో వృద్ధులకు ప్రతి రోజు ఒక గంటపాటు చదువు నేర్పించాల్సి ఉంటుందన్నారు. కష్టమైన పనిని ఇష్టంగా చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీవిద్య, డ్వాక్రా సీసీ అపర్ణ, యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ అందరి బాధ్యత

రాయచోటి అర్బన్ : ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎల్ఐసీ యూనియన్ రాయచోటి నేతలు విశ్వనాథ్, ఆదినారాయణరెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణలు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 15వ తేదీన రాయచోటి పట్టణంలో నిర్వహింప తలపెట్టిన కళాజాతా పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కీలకమైన విద్య, వైద్యం, రవాణా, బ్యాంకింగ్, ఇన్సురెన్స్, పోస్టల్, రైల్వే, విద్యుత్ తదితర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు, కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పేందుకు ప్రయత్నిస్తోందన్నారు. పాలకుల యత్నాలను తిప్పికొడుతూ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటూ దేశ ఆర్థిక రంగాన్ని, ప్రజాసంక్షేమాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. 15వ తేదీ ఉదయం పట్టణంలోని నేతాజీ సర్కిల్‌లో నిర్వహిస్తున్న కళాజాతా కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ నేతలు గిరిధర్, సుధాకర్, రెడ్డిచక్రవర్తి, కళ్యాణ్, సువర్ణ, వైష్ణవి, సీఐటీయూ నేత శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి సహకార వారోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరణలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లా సహకార శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. నవంబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వికసిత భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి గురుప్రకాష్ రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం


నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10.9 శాతం నిధులు కేటాయించడం దారుణమని ఏబీవీపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ జె.పి.నాగిరెడ్డి అన్నారు. తమ సమస్యల పరిష్కారంలో పాలకులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగం అభివృద్ధికి 10.9 శాతం కేటాయించారంటే పాలకులు విద్యారంగం అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమంతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4నెలలు గడుస్తున్నప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేటి వరకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. 100 రోజుల్లో విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తానంటూ చెప్పిన మంత్రి లోకేష్‌బాబు తర్వాత పట్టించుకున్న పాపానపోలేదంటూ విమర్శించారు. కొఠారి కమిషన్ సిఫార్సులు ఎప్పుడు అమలు పరుస్తారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వసతిగృహాలలో చదువుతున్న ఎస్సీ ,ఎస్టీ ,బిసి విద్యార్థులకు ఏ విధంగా న్యాయం చేయగలుగుతారన్నారు. వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించని పక్షంలో విద్యార్థులతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి విజయ్, దేవప్రకాష్ పాల్గొన్నారు.

ఒంటిమిట్టను కరువు మండలంగా ప్రకటించండి

ఒంటిమిట్ట : వర్షాలు సకాలంలో పడక రైతులు వేసిన పంటలు తీవ్రంగా నష్టపోయారని, ఒంటిమిట్టను కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి కోనేటి నరసయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ గత ఏడాది కూడా వర్షాలు పడక రైతులు నష్టపోయారని ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లోనూ సకాలంలో వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోయాయన్నారు. మండలాన్ని కరువు ప్రభావితంగా ప్రకటించాలని లేకుంటే ఈనెల 14వ తేదీ సీపీఎం జిల్లా పిలుపు మేరకు కలెక్టరేట్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పుల్లయ్య, సుబ్బరాయుడు, గురుస్వామి, గంగాధర్, రఫీ పాల్గొన్నారు.

విద్యార్థుల ఘర్షణ; మందలించిన ఉపాధ్యాయుడు


దెబ్బలను చూపుతున్న విద్యార్థి విఘ్నేష్

సుండుపల్లె : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విఘ్నేష్ అనే విద్యార్థిని తెలుగు బోధించే లోకేష్ అనే ఉపాధ్యాయుడు మందలించడంతో విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే విఘ్నేష్ అనే విద్యార్థి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం చివరి పిరియడ్‌లో లోకేష్ అనే ఉపాధ్యాయుడు క్లాస్‌కు వెళ్లగా విఘ్నేష్, మరో విద్యార్థి ఇద్దరూ గొడవ పడుతుండటాన్ని చూసి విఘ్నేష్‌ను ఉపాధ్యాయుడు మందలించాడు. పాఠశాల వదిలేసిన తరువాత విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయాన్ని తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. విద్యార్థి తల్లిదండ్రులు మా కొడుకును ఎందుకు కొట్టావు అని ఉపాధ్యాయుడిని అడుగగా విద్యార్థి మరో విద్యార్థితో గొడవ పడుతుండటంతో మందలించానని, కక్షపూరితంగా కొట్టలేదని జరిగిన విషయాన్ని ఉపాధ్యాయుడు తల్లిదండ్రులకు వివరించారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు అక్కడి నుండి వెళ్లిపోయారు.

ఇసుక రవాణాలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఒంటిమిట్ట : మండలంలోని గొల్లపల్లి పంచాయతీలో ఉన్న ఇసుక క్వారీని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ మంగళవారం పరిశీలించారు. ఉచిత ఇసుక రవాణాకు సంబంధించి అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇసుక క్వారీ కాంట్రాక్టర్, ట్రాక్టర్ యజమానులు, కూలీలు, గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ఇసుక క్వారీలో ఇసుకను పోసేందుకు ఎలాంటి యంత్రాలను వినియోగించరాదని, క్వారీ నుండి ఇసుకను డంప్ చేసిన తరువాత ప్రజల అవసరాల నిమిత్తం స్థానిక సచివాలయం, పంచాయతీ కార్యాలయం నుంచి రశీదును స్వీకరించి ఉచిత ఇసుక రవాణా చేయాలని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న రైతులు

వీరబల్లి : మాండవ్య నది నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. దీంతో మంగళవారం మండలంలోని రైతులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచితం పేరుతో ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారన్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ శ్రావణిని వివరణ కోరగా స్థానికంగా ప్రజల అవసరాల కోసం ఉచితంగా తోలుకోవాలని, అక్రమంగా ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉత్తమ సేవలకు పురస్కారం


చిన్నమండెం: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న రాజ్‌మహమ్మద్


రైల్వేకోడూరు అర్బన్: అవార్డు అందుకుంటున్న అధ్యాపకురాలు సదరున్నీషా